


# పాపం... బ్రహ్మానందం!

- పచ్చిగోళ్ళ సుధ

"ఏరా.. నానీ! ఎందుకేడుస్తున్నావ్?" అరగంట ముందు కాన్వెంట్‌కని బయలుదేరిన నానీ ఏడుస్తూ వచ్చేసరికి ఆత్రంగా అడిగాడు బ్రహ్మానందం.

"డాడీ...! మా స్కూల్లో పిల్లోడు.. పిల్లోడు" వెక్కుతున్న నానీని దగ్గరకు తీసుకుంటూ "ఏం జరిగిందో... చెప్పు.. ఆ.. పిల్లోడు ఏమయింది...?"

"వాడికేం కాలేదు డాడీ...! వాడు నన్ను 'గాడిద కొడకా' అని తిట్టాడు" ఏడుపు మరింత ఉధృతం చేస్తూ చెప్పాడు.

"గాడిద కొడకా అన్నాడా...? అయితే నువ్వెందుకు ఏడుస్తావు.. నేనే డవాలి"

"వాడు తిట్టింది నన్ను... " నానీ గట్టిగా అరిచాడు.

"కాదురా.. నన్ను" బ్రహ్మానందం పళ్ళు పటపటలాడించాడు.

"కాదు.. నన్ను" పెంకిగా అన్నాడు నానీ.

"కాదు.. నన్నే" బ్రహ్మానందం జుట్టు పీక్కున్నాడు.

"అయితే.. ఏడు" అంటూ లోప లికి పోతున్న కొడుకును చూస్తూ "అరి బడవా... వేలెడు లేడు.. వీడి కెంత పొగరు" అనుకుంటూ "ఒరేయ్.. నానీ! ఇలా రా.." పిలిచాడు బ్రహ్మా నందం.

"ఎందుకు..?" వెనక్కి తిరక్కుం డానే అడిగాడు నాని.

"కాన్వెంటుకి వెళ్ళలేదేం..?"

"కాన్వెంటు లేదు.."

"ఆ మాట విన్న భాగ్యవతి పరుగు పరుగున హాల్లోకి వచ్చి "ఏరా.. వెధవా.. ఈ అబద్ధాలు ఎప్పట్నుంచి నేర్చుకున్నావురా..? చూసారా వీడెన్ని అబద్ధాలు చెప్తున్నాడో..?"

"పోనీలేవే వాడు చెప్తున్నాడుగా కాన్వెంటు లేదని" బ్రహ్మానందం సాఫీగా అన్నాడు.

"మీరు నోరు మూసుకోండి. వాడే దంటే అది "ఊ" అంటారు. నేను నిన్న గుళ్ళోకి వెళ్ళినపుడు చూసాను కనుక సరిపోయింది. కాన్వెంటు లేకపోవడం ఏంటి? నిక్షేపంలా అక్కడే వుంటేనూ? ఒక్క రాత్రిలోనే ఏమయిపోతుంది..? వీడి అబద్ధాలు కాకపోతేనూ?"

"ఒసేయ్.. భాగ్యం! నిన్ను కట్టు కున్నందుకు ఎందులోనయినా దూకి చావాలే! వాడన్నది కాన్వెంటు లేదంటే.. అక్కడ కాన్వెంటు లేకపో వడం కాదు. క్లాసులు జరగడం లేదని అర్థం. మీ నాన్నకు నేనే దొరికానే అమాయకుడ్ని.. ఇంత తెలివిలేనిదాన్ని నాకు కట్టబెట్టాడు.

"మీరూ తెలివిలేనివారే. నా మాటలు బొత్తిగా అర్థంచేసుకోలేకపో తున్నారు.."

"అబ్బ..బ్బ.. ఆంటీ...! మళ్ళీ అంకుల్, మీరూ గొడవ మొదలు పెట్టారన్నమాట. ఏమిటి అంకుల్!

మీరు కూడా. ఆఫీసు టైమవుతోంది. మీరు బయలుదేరే ముందు ఎప్పటి లాగే రెండు జోక్స్ చెప్తాను" అంటూ కుర్చీలో కూర్చున్నాడు ఏడుకొండలు.

"మవ్వేంటిరా.. నా ప్రాణానికి..? ఓ ప్రక్క మీ ఆంటీ, మరో ప్రక్క మవ్వూ.. చస్తున్నారా.. కొండలూ...!"

"తప్పదంకుల్.. నేను పెద్ద జోకిస్టుగా పేరుతెచ్చుకోవాలి. అప్పటివరకూ మీరు వినక తప్పదు."

"అదేంటో త్వరగా చెప్పరా తండ్రీ... అవతల ఆఫీసుకు పోవాలి.

"ఆ.. ఆ.. చెప్పున్నా. ఒకామెతో ఒకామె అందీ... "మా ఆయన నోట్లో వేలు పెట్టినా కొరకలేదు" అని. వెంటనే ఆవిడ అంది "అబ్బా... అంత మంచివారా మీ ఆయన...?" అని. అవుడు, ఈవిడ అంది.. "మంచి వారా.. పాడా..? కొరడానికి నోట్లో పళ్ళుంటేగా..?" అసలు విషయం చెప్పింది. అంకుల్ ఎలా వుంది ఈ జోక్. పత్రికకు పంపొచ్చునంటారా..?

"పంపవయ్యా.. చాలా బావుంది. నీ జోక్ వేసుకుంటే వాళ్ళ పత్రికకు సర్క్యులేషన్ పెరుగుతుంది కూడా!"

"అంకుల్ మరో జోక్ కూడా వినేసిపొండి. మొదట ఆమెతో రెండవ ఆమె అంటోంది – "మా ఆయన ఫేంట్ వేసుకోరు వదినా" అని. "అయ్యో... మాయదారి రోజులు. మీ ఆయన అంత సిగ్గులేని వారా..?" బుగ్గలు నొక్కుకుంటూ అడిగింది ఆమె. "ఫేంటు వేసుకోరని అన్నాను గానీ.. పంచె కట్టుకోరని చెప్పలేదుగా" కోపంగా అంటూ వెళ్ళిపోయింది: ఈ జోక్ ఎలా వుందంకుల్..?" ఆశగా అడిగాడు ఏడుకొండలు.

"నిజం చెప్పొద్దూ.. కితకితలు పెట్టుకుంటేగానీ.. నవ్వొచ్చేలా లేదు.

"డాడీ! అమ్మ భోజనానికి రమ్మంటోంది" ఆ ఒక్క మాట చెప్పేసి తుర్రుమన్నాడు నానీ.

"వీడొకడు..రేగిపండు మధ్య గింజలా. ఏదీ చెప్పనివ్వడూ.. విననివ్వడు..." అంటూ వెళ్ళిపోయాడు.

"ఏవండీ..! ఇంకాస్త కూర వేసుకోండి. టి.వి.లో చూసి వండాను."

"నీ కెన్నిసార్లు చెప్పానే.. ఆ టి.వి.లో చూసి వండొద్దని"

"ఇప్పుడేమయిందండీ...?"

"ఏమయిందా.. కూర మరీ లిప్‌స్టిక్ వాసన వస్తోంది"

"అయితే... కాస్త ఎక్కువై వుంటుంది. అక్కడకీ.. వాళ్ళు వేసుకున్నట్టే వేసుకున్నాను. మాయదారి గోల ఎన్నిసార్లు చూసినా.. ఆ కొలతలు తెలుసుకోలేక పోతున్నాను.." తెగ బాధపడిపోయింది భాగ్యవతి.

"ఇక నోరు మూస్తావా... ఏదో నాకు బుద్ధి లేక అన్నాను. అయినా కూర లిప్‌స్టిక్ వాసన రావడమేమిటే.. ఛీ.. ఛీ.. ఇంతకన్నా తెలివి తక్కువది వుంటుందా.. దేవుడా..?"

"ఎంగిలి నోటితో దేవుణ్ని తలవకూడదని మీ కెన్నిసార్లు చెప్పాలి" కోపంగా అంది.

"అవును.. చెప్పావుకదూ! తప్పయిపోయింది. తిన్నది చాలు కానీ.. ఆఫీసుకి పోయి వస్తాను" అంటూ చేయి కడుక్కుని వెళ్ళిపోయాడు బ్రహ్మానందం.

xxx

"పది గంటలకి ఆఫీసు అయితే.. ఇంత లేటుగానా ఆఫీసుకి రావడం..?" బ్రహ్మానందాన్ని కోప్పడ్డాడు ఆఫీసర్.

"సారీ.. సర్! మా ఆవిడ లారీ కింద పడింది... అందుక...." ఆఫీసర్ బారి నుండి తప్పించుకోడానికి ఏదో చిన్న అబద్ధం చెప్పాడు బ్రహ్మానందం.

"లారీ కేమయినా అయిందా..?" చాలా ఆత్రంగా అడిగాడు ఆఫీసర్.

"ఫ్రెంట్ పార్ట్ కొద్దిగా దెబ్బతింద", విచారంగా చెప్పాడు బ్రహ్మానందం.

"బాధపడకు. కష్టలు ఎవరికయినా వస్తాయి. ఎందుకయినా మంచిది నీ బండికి ఇన్స్యూరెన్స్ చేయించుకోవయ్యా.."

"చిత్తం.. అలాగేనండి"

"సరే .. పోయి సీట్లో కూర్చో.."

బ్రహ్మానందం గబగబా బయటకు వచ్చేసాడు.

"ఏమిట్రా.. బ్రహ్మం..! మన ఆఫీసర్‌గాడు క్లాసు తీసుకున్నాడు?" వెటకారంగా అడిగాడు వెంకట్రావ్.

"ఏం లేదు. మన వెంకట్రావ్ ఎలాంటోడని అడిగితేనూ.. చెప్తొస్తున్నా."

"ఏం చెప్పావురా..?" భయంగా అడిగాడు.

"ఒక్క మాటలో చెప్పారా.. డ్రాయరు కింద కాళ్ళుంటాయని, ఫేంటు వేసుకోనంటాడని చెప్పా!"

"నీకిదేమయినా న్యాయంగా వుందిరా. బ్రహ్మం. ఏదో పాదుష్పచేయాలని తాపత్రయపడే నన్ను బొత్తిగా పిసినిగొట్టులా చెప్తావా?"


"నోరు ముయ్యరా.. నీ గురించి నా కెందుకూ.. పోయి పనిచూడు" విసుక్కున్నాడు.

"అయితే ఏం చెప్పలేదన్న మాట.. హమ్మయ్య.." అనుకుంటూ వెళ్ళిపోయాడు.

బ్రహ్మానందం ఫైల్సన్నీ ముందేసుకున్నాడు.

xxx

"అంకుల్.. అంకుల్.. ఇవేళ నేనో కవిత రాసాను" చదవడానికి సిద్ధపడుతూ చెప్పాడు ఏడుకొండలు.



"ఒరేయ్.. కొండలూ..! నన్నెందుకురా తింటావ్? నా నెత్తి మీద సరిగ్గా నాలుగంటే నాలుగు వెంట్రుకలు మిగిలాయి. ప్రతిరోజూ లెక్కపెట్టుకుని సంతోషపడే నాకు అవి కూడా కరువయ్యేలా చెయ్యకు..?"

"నా కవిత వింటే ఏవైనా మొలవాలి తప్ప రాలిపోకూడదు. వినండి చదువుతా.

చూసాను ఆమెను ఓరచూపు
పిలిచాను రమ్మని రేవు
వాళ్ళన్నయ్య కాసాడు కాపు
అయ్యింది నా వళ్ళు వాపు!

"ఎలా వుందంకుల్..?" చాలా ఆత్రంగా అడిగాడు ఏడుకొండలు.

"నా తలకాయలా వుంది.."

"అబ్బా అంత బావుందా..?"

"ఒరేయ్ ఏడుకొండలూ.. ఎందుకురా నన్నిలా ఏడిపిస్తావ్? ఏదో పక్కింటి కుర్రాడివని కనికరిస్తే ఇలా కవిత వినిపించడం ఏమయినా బాగుందా.. చెప్పు?" ఇంచుమించు ఏడుపు ముఖంతో అడిగాడు బ్రహ్మానందం.

"ఏమిటంకుల్ మీరు మరీనూ.. ఎవరయినా పుట్టుకతోనే పెద్ద రచయితగా పుడతారేమిటి..? ఇలా రాసి రాసి ఏదో ఒక రోజు రాణిస్తారు."

"ఇక నన్ను వదిలి పెట్టవయ్యా బాబూ.." చేతులు రెండూ జోడించి మరీ అడిగాడు.

"మళ్ళీ రేపు కలుస్తానంకుల్. వస్తాను.." అంటూ వెడుతున్న ఏడుకొండలు బారినుండి ఎలా విముక్తి కావాలో తెలియక బ్రహ్మానందం తెగ బాధపడిపోయాడు.

"ఏమేవ్.. భాగ్యం! నా షర్ట్ జేబులో ఐదువందల నోటు పెట్టాను. నువ్వు గానీ తీసావా..? కనిపించిచావడం లేదు."

"తీసానండి..!"

"అంత డబ్బు ఏం చేసావే.. చీరేమయినా కొనేసావా?" కంగారుగా అడిగాడు.

"లేదండీ.. మిమ్మల్ని అడక్కుండా కొంటానా..?"

"మరేం చేసావే...?"

"ఉతికి ఆరేసాను.."

"నీ తెలివి కోటిపల్లి రేవులో కలసిపోను.. నీతో చస్తున్నా కదే..! ఎవ

రయినా నోట్లను ఉతికి ఆరేస్తారే..?" కోపంతో ఊగిపోయాడు.

"మీరే కదా.. నోటు బొత్తిగా మాసిపోయిందని తెగ బాధపడిపోయారు. మొన్నటికి మొన్న అంతే.. బట్టలు మాసిపోయాయని నేను ఉతికి ఆరేయలేదని కోపం తెచ్చుకున్నారు. ఒకసారయితే మీరు చెప్పాలికానీ.. ప్రతీ సారీ చెప్పించుకుంటానా.. ఏంటి..? అందుకే వెంటనే ఉతికి ఆరేసాను. ఉతకడం ఎక్కువయిందనుకుంటాను చిరిగితేనూ.. మిషనువాడికి ఇద్దామని ఇప్పుడే అనుకుంటున్నా. అంతలో మీరూ వచ్చారు.."

"నీ దుంప తెగ. నీ తెలివి నక్స లైట్లు ఎత్తుకుపోను. నీతో బ్రతకలేక చస్తున్నా.." పెద్ద పెద్ద కేకలు వేసేసరికి ఏడుకొండలు పరిగెత్తుకొచ్చాడు.

"ఎందుకు ఆ కోపము
ఏమిటి ఆంటీ లోపము
రోజూ గొడవ పడటం పాపము
మిమ్మల్ని కలపమని చేస్తున్నా జపము

"ఒరేయ.. ఒరేయ్.. కొండలూ..! నోరు ముయ్యరా.. నీ కవితల పిచ్చి బంగాళాఖాతంలో కలసిపోను. నువ్వో గోల.. మీ ఆంటీ ఓ గోల.

మీ ఆంటీ ఏం చేసిందో తెలుసా? ఐదు వందల నోటుని ఉతికి ఆరేసింది. మొన్నటికి మొన్న పక్కింటి పిన్నిగారి కిటికీకి ఎదురుగా నా కట్ డ్రాయరు ఆరేసింది. ఆవిడగారి మడి మైల పడిందని దీనిమీద కయ్యిమని లేచింది. దీనితో వేగలేక చస్తున్నా. నువ్వు జోక్స్ వినిపిస్తావో.. కవితలే వినిపిస్తావో.. పాటలే పాడతావో.. ఆటలే ఆడతావో.. దాన్ని మార్చగలిగితే మార్చు.." అంటూ బయటకి వెళ్ళిపోయిన బ్రహ్మానందాన్ని చూస్తూ "ఏదో ఒకటి చెయ్యాలి" అనుకున్నాడు ఏడుకొండలు.

xxx

"ఏమయ్యా.. బ్రహ్మానందం! నీకు అర్జెంటు కాల్ వచ్చింది. మీ ఆవిడ ఆత్మహత్యా ప్రయత్నం చేసుకుందట. పోయి చూడు" చెప్పాడు మేనేజరు.

"అయ్యో.. నా భాగ్యానికి ఏమయిందండీ.. అయ్యో.." అంటూ ఇంటికి పరిగెత్తాడు.

ఇంటికి వచ్చేసరికి గుమ్మంలోనే ఎదురయిన ఏడుకొండల్ని చూసి ఏమయిందిరా మీ ఆంటీకి..?"

"ఆత్మహత్యా ప్రయత్నం చేసుకుంది?" చెప్పాడు.

"ఆత్మహత్యా ప్రయత్నం చేసుకుందని ఆమ్లెట్ తిన్నంత ఇదిగా చెప్తావా? ఈ విషయం పోలీసులకు తెలిస్తే.. నేదో కట్నం కోసం హింసిస్తున్నానని.. సెకండ్ సెటప్‌తో సెటిల్ అయిపోయానని.. లేనిపోని అభాండాలేసి.. నా బాడీని కైమా చేసేస్తారు" ఏడుస్తూ అంటున్న బ్రహ్మానందాన్ని చూస్తూ..

"అంకుల్.. ఈ యాక్టింగ్‌లో నిన్ను చూస్తుంటే.. అదేదో సినిమాలో బ్రహ్మానందం ఫీలింగ్స్ గుర్తు వస్తున్నాయి. మీరు కూడా పిక్చర్స్‌లో యాక్ట్ చెయ్యొచ్చునేమో..!"

"యాక్టింగ్ తర్వాతగానీ.. ఆంటీ ఎందుకింత పిచ్చిపని చేసిందిరా.. ఇప్పుడెక్కడుంది?"

"హాస్పటల్లో జాయిన్ చేసాను"

"ఎందుకిలా చేసిందో.. నీతో ఏమయినా చెప్పిందేంటిరా? నానీగాడు ఎలా వున్నాడు?"

"వాళ్ళమ్మకిలా వున్నందుకు నానీగాడికి ఏడుపు రావడం లేదని ఒకటే ఏడుస్తున్నాడు. అసలేమయిందంటే.. మీరు ఆఫీసుకు వెళ్ళాక ఆంటీకి చెప్పాను మీ వల్ల అంకుల్ పాపం చాలా బాధపడుతున్నారు. మీరు చేసే తెలివితక్కువ పనులకు మరో మగాడయితే.. తనయినా చచ్చిపోతాడు. భార్యనయినా చంపేస్తాడు.. పాపం అంకుల్ పిరికివారు మూలంగా ఏదీ చెయ్యలేక వూరుకున్నారు" అన్నాను.

ఆంటీ కూడా చాలా బాధపడింది. ఇంకో చిన్న అబద్ధం కూడా చెప్పాను. అంకుల్‌కి ఎప్పట్నుంచో ఆఫీసులో పని చేసే అమ్మాయి మీద వుంది. మీరుండగా ఆమెను పెళ్ళిచేసుకోలేక, ఆమెను మరచిపోలేక బోనులో ఎలకలా గింజుకుంటున్నారు" అని చెప్పా. ఇంత త్వరగా ఇలాంటి పని చేస్తుందని నాకు మాత్రం ఏం తెలుసు?

"ఎంత పనిచేసావురా.. కొండలూ..! ముందు ఆంటీ దగ్గరకు తీసుకెళ్ళు మాట్లాడాలి."

"పదండి" అంటూ నడిచాడు.

హాస్పటల్‌కి చేరుకున్నారు. భాగ్యవతి వున్న రూమ్ చూపించాడు. బ్రహ్మానందం పరుగున వెళ్ళి.. "భాగ్యం.. నా భాగ్యం.. ఎందుకిలా చేసావ్?" అడిగాడు.

"ఏవండీ.. నేను చచ్చిపోతేనేగానీ.. రెండవ పెళ్ళి చేసుకోరని మన ఏడుకొండలు చెప్పాడు. ఆలస్యం చేస్తే మీకు కలవులు వుండవని.. ఇప్పుడే.. చచ్చిపోదామని చీమల మందు మింగాను.

"ఏవండీ..! ఆ కిరాణాషాపువాడు మనల్ని చాలా మోసం చేసాడండీ..!"

"ఇవుడేమయిందని..?"

"ఏమవడం ఏంటండీ.. ఆ చీమల మందు రెండవ రకానిది ఇచ్చాడు. అందుకే చావకుండా బతికాను.. పాపం మీరు ఆఫీసులో అమ్మాయిని ఎప్పుడు చేసుకుంటారు?"

"భాగ్యం..! నువ్వెంత మంచిదానివి భాగ్యం. ఎంత అమాయకురాలివి. నా సుఖం కోసం నువ్వు చనిపోదామనుకున్నావా? నువ్వు చేసే పనులకు నేనెంత చిరాకుపడినా, నువ్వు మాత్రం నా కోసం ఆలోచించి ప్రాణాలు తీసుకుందామనుకున్నావా"

"నీ ప్రేమ ఎంత గొప్పది భాగ్యం! నీకు తెలివి లేకపోయినా ఫర్వాలేదు. నీకు మనసుంది. మళ్ళీ జన్మకి కూడా నువ్వే నా భార్యవి" అంటూ భాగ్యవతిని దగ్గరకు తీసుకున్నాడు బ్రహ్మానందం.

పాపం మన ఏడుకొండలు చాలా మంచివాడండి. వాడే అలా చెప్పకపోతే.. నాసిరకం చీమల మందు ఇచ్చి ఆ కిరాణా కొట్టువాడు మనల్ని మోసం చేసాడని ఎలా తెలుసుకునే వాళ్ళం చెప్పండి..?"

ఆ మాట విన్న బ్రహ్మానందం జుట్టు పీక్కున్నాడు. చేతిలోకి వచ్చిన నాలుగు వెంట్రుకల్ని చూసి బోరుమన్నాడు.

అక్కడికి అప్పుడే వచ్చిన నానిగాడు తండ్రిని చూసి ఎందుకు డాడీ ఏడుస్తున్నారు. నన్నెవరూ 'గాడిద కొడకా' అని తిట్టలేదే..?" ఆలోచనలో పడ్డాడు.

"అంకుల్! ఈ రోజు వినిపించాల్సిన జోక్స్ తెచ్చాను. వినిపించమంటారా..?"

"ఏడుకొండలూ.. నీకు పుణ్యం వుంటాదిరా.. పేషంట్లని ప్రాణాలతో ఉండనీయ్. బిల్లు వేసేటప్పుడు డాక్టర్కి వినిపించు. నీ మేలు మర్చిపోను."

"సరే.. అంకుల్" అంటూ వెళ్ళిపోయాడు.

అప్పటికి గండం గడిచినందుకు బ్రహ్మానందం నిట్టూర్చాడు.

